# ఉచిత వైద్యశిబిరం.. అభినందనీయం

## మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25 : పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, యశోద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లో నివసించే పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో రోగాన్ని గుర్తించడం వల్ల సకాలంలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. గుర్తించడం ఆలస్యమైతే... రోగ తీవ్రత పెరుగుతుందని.. తద్వారా చికిత్స పొందడం ఇబ్బంది అవుతుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు ముందస్తూ ఆరోగ్య పరీక్షలు చేసుకుని, ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పగుడాల శిరీషా, ముద్దం నర్సింహాయాదవ్, మాజీ కార్పొరేటర్ పి.బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, డాక్టర్ వెంకట్‌రావు, కె.నాగరాజు, రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, సుభాశ్‌గౌడ్, సురేశ్ గౌడ్, పృథ్వీరాజ్, కల్యాణి, శారద, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ కాలనీలో ఉచిత వైద్యశిబిరంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీషాబాబురావు, నర్సింహాయాదవ్, తదితరులు

తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

## హిందూ ధర్మం కోసం పోరాడిన మహనీయుడు సేవాలాల్

మియాపూర్, ఆగస్టు 25 : దేశం కోసం, హిందూ ధర్మం కోసం సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గిరిజనులు ఎంతో భక్తి ప్రపత్తులతో తీజ్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. మియాపూర్ నడిగడ్డ తండాలో ఆదివారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం సేవాలాల్ ఎంతగానో కృషి చేశారని, తద్వారా గిరిజనుల ఆరాధ్య దైవంగా కొలుస్తారన్నారు. గిరిజనులు విద్యావంతులై అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన సేవాలాల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మోహన్, గంగాధర్, తండా వాసులు స్వామి నాయక్, లక్పతి , తిరుపతి, శంకర్, రత్నాకర్, అబ్రహం , సుధాకర్, జిత్తు , మధు, సీతారాం, హన్మంతు, గోపి, తుకారం, దశరథ్ నాయక్, హరి, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25 : కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని శ్రీ విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్, కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు వార్షికోత్సవ పూజలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీజయ శ్రీ వైష్ణోదేవి ఆలయంలో..

దుండిగల్,ఆగస్టు 25: గాజులరామారం సర్కిల్(డివిజన్) పరిధి, శ్రీనల్లగుట్ట వెంకటాద్రిహిల్స్ గుహలలో త్రిశక్తి పీఠంగా వెలసిన శ్రీజయ శ్రీ వైష్ణోదేవి అమ్మవారి ఆలయంలో శ్రీకృష్ణాజన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రత్యేకపూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భజన కార్యక్రమం, 28న ఉదయం 10 గంటలకు శ్రీమహాలక్ష్మి ప్రత్యంగిరి, శ్రీజయ శ్రీవైష్ణవి దేవి సామూహిక కుంకుమార్చన, 29న ఉదయం 10 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం , 30న ఉదయం 10 నుంచి లక్ష్మీ గణపతి, వనదుర్గ, జయశ్రీ వైష్ణవిదేవి, మహామృత్యుంజయ గాయత్రి మాత, శ్రీ సూర్య భగవాన్ మహాయజ్ఞం, 31న ఉదయం 7 గంటలకు శ్రీమాతా వైష్ణవి దేవి మాతా రాణి ఎక్‌షాం గోమాత కే నామ్ జాగరణ, సెప్టెంబర్ 1న ఉదయం 5 గంటలకు శ్రీనవదుర్గ బోనాల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## కష్టపడి చదివితే... బంగారు భవిష్యత్

### 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతుల అందజేత

కూకట్‌పల్లిలో పదవ తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంఈవో హరిశ్‌చంద్ర, దొరరాజు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీని చెందిన ఆలీవ్ మిఠాయి సంస్థ అధినేత దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అకాడమిక్ ఎక్సలెన్సీ అవార్డు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. గత యేడాది పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంఈవో హరిశ్‌చంద్రా, ఆలీవ్ మిఠాయి సంస్థ అధినేత దొరబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతియేటా 10వేల మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్, పెన్నులు, డిక్షనరీతో కూడిన పాఠశాల కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. సొంతంగా, మిత్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆలీవ్ సంస్థ యజమాని దొరబాబు పేద విద్యార్థు లను ప్రోత్సహించేందుకు నగదు బహుమానాన్ని అందించడం సంతోషకరమన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం ఎల్లప్పుడు సహకారాన్ని అందిస్తానని దొరబాబు తెలిపారు. కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదివి...పదో తరగతి పరీక్షల్లో స్కూల్ టాఫర్‌గా నిలిచిన విద్యార్థికి...ఒక్కొక్కరి రూ. 10వేల చొప్పున... 16 మంది విద్యార్థులకు రూ.1.60 లక్షల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

సంక్షేమ సంఘాల ప్రతినిధుల సమస్యలు వింటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, ఆగస్టు 25: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామని, స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరగా .. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

మాదాపూర్, ఆగస్టు 25: బస్తీ సమస్యలపై సమీక్ష జరిపి.. అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్ నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో ఆదివారం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం బస్తీలోని శ్మశాన వాటిక పనులను స్థానికులతో కలిసి చర్చించారు. దీంతో స్థానిక ప్రజలు శ్మశాన వాటికలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నూతన అధ్యక్షుడు కృష్ణ నాయక్, గౌరవ అధ్యక్షుడు నీలం బ్రహ్మయ్య యాదవ్, గౌరవ సలహాదారు తలారి కేశవులు, రామచందర్ యాదవ్, ఉపాధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, చింతల తిరుపతయ్య, జెట్టి హుస్సేన్, రజనీకాంత్, రమేశ్ నాయక్, చందు, చెన్నకేశవులు, నాగులు, తదితరులు ఉన్నారు.

## ఆర్యవైశ్యులు సంఘటితంగా ముందుకు సాగాలి

ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ముందుకు సాగాలని సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు కుమారస్వామి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలో జరిగిన ఆర్యవైశ్య సంఘం సమావేశంలో కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్‌గుప్తాలను ఎల్లమ్మబండ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన విజయలక్ష్మిలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్లమ్మబండలో ఆర్యవైశ్య సంఘం భవనాన్ని నిర్మించుకోవడం గొప్పవిషయన్నారు. ఎల్లమ్మబండ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా ముందుకుసాగాలని, పేదల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్లయ్య, మాజీ అధ్యక్షుడు జగన్నాథం, కాల్వ శ్రీనివాసులు, కొండల్‌రావు, ప్రవీణ్‌లు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి న గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో చో టు చేసుకుంది. ఎస్ఐ ప్రవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 14న రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంపల్లిలోని హిందూబాల పెట్రోల్‌బంక్ ముందు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి( సుమారు 45)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెం దాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## నాణ్యతతో రహదారుల నిర్మాణం ..

ఆల్విన్ కాలనీ డివిజన్, నవోదయ కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కార్పొరేటర్ వెంకటేశ్ ఆదివారం పరిశీలించారు. రహదారి క్యూరింగ్ చర్యలతో పాటు ఇరువైపులా మట్టి వేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నాణ్యతతో రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల్లో చెట్లు నాటాలని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రమణ, రాజిరెడ్డి, బాలస్వామి, గణేశ్, శివశంకర్, లక్ష్మణ్, మధన్, వాసు, కిశోర్, రాఘవ, శ్రీకాంత్, నాగేశ్వర్‌రావు, అశోక్ , హరి, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్ , ఆగస్టు 25

## ఘనంగా చెరుకు కుమారస్వామి జన్మదిన వేడుకలు

కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు కుమారస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆది వారం కాలనీ 3వ ఫేజ్‌లోని శ్రీవాసవి దేవాలయ ప్రాంగణంలో జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. భక్తులకు, పేదలకు అన్నసమారాధన చేశారు. జన్మదినం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు కుమారస్వామికి పుష్ప గుచ్ఛాలు అందించి... శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25

## గౌడ సంఘం నూతన కార్యవర్గం ..

కబీర్‌నగర్ పోచమ్మ ఆలయంలో ఆదివారం గౌడ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోతీనగర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. త్వరలో పూర్తి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ గౌడ్, ఇ.లాలయ్య గౌడ్, సంజీవ గౌడ్, వికీ గౌడ్, నవీన్ గౌడ్, పవన్ గౌడ్, హనుమంత్‌గౌడ్, రాంబాబు గౌడ్, తదితరులు పాల్గొన్నారు. – అల్లాపూర్,ఆగస్టు 25

## ఉచిత వైద్య శిబిరానికి రండి..

దుండిగల్,ఆగస్టు 25: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,రాజీవ్‌గృహకల్ప సముదాయానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)ను ఆయన కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం రాజీవ్‌గృహకల్పలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించగా కేఎస్ఆర్ సానుకూలంగా స్పందించారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కూడలిలో ఉన్న హేమదుర్గా మాత ఆలయ 24 వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు , కాంగ్రెస్ నేత బండి రమేశ్ దంపతులు వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హేమదుర్గా మాత వార్షికోత్సవాన్ని ప్రతి ఏడాది వైభవంగా నిర్వహిస్తున్నట్లు, అన్నసంతర్పణ చేపడుతున్నట్లు, అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపైనా ఉండాలని రమేశ్ ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సహా ఇతర నేతలు పాల్గొన్నారు. – మియాపూర్ , ఆగస్టు 25

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత వైద్యశిబిరంలో కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, ఆగస్టు 25: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్ డివిజన్ సబీహా బేగం ప్రజలకు సూచించారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ లైబ్రరీపార్కులో లోహియా ఆరోగ్య జీవన సంస్థ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసి న ఉచిత ఆక్యూప్రెషర్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సం దర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...అక్యూప్రెషర్ మ్యాగ్నెటిక్ చికిత్స, వైబ్రేషన్, సూచిజోక్ చికిత్సల ద్వారా నడుము నొప్పి, మోకాళ్ల నొప్పి, ఆస్త మా, నిద్రలేమి తదితర వ్యాధులతో బాధపడుతున్నవారు మందులు లేకుండా నయంచేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, సుమన్, రమణ, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన పలు ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల కూచిపూడి, భరతనాట్య నృత్య రీతులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో మంచిర్యాల శ్రీ శార్వాణి కూచిపూడి నృత్యాలయం నాట్య గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ శిష్య బృందం వినాయక కౌతం, స్వాగతం కృష్ణ, జతిస్వరం, కృష్ణ శబ్దం, దశావతార శబ్దం, స్వరజతి, కృష్ణ జనన శబ్దం, మంగళం అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, రాశి సచిదానందా శిష్య బృందం మల్లరి, గణేశా వందన, గురులేఖ కృతి, శ్యామలే మీనాక్షి, అర్ధనారీశ్వర స్తోత్రం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. – కొండాపూర్, ఆగస్టు 25

## హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్రప్రదర్శన

కొండాపూర్, ఆగస్టు 25 : చేనేతకారులను మరింత ప్రోత్సహించాలని మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందనా జయరాం అన్నారు. సోమవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, చేనేతకారులను మరింతగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలను తిలకిస్తూ వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకన్నారు. ప్రదర్శన ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, ఇందులో 14 రాష్ట్రాల నుంచి విచ్చేసిన చేనేతకారులు, హస్తకళా ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు జయేష్ గుప్తా అన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరాం

## బోనాల జాతర

గాజులరామారంలోని శ్రీనల్లపోచమ్మ, రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు గత నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నా యి. ఇందులో భాగంగా ఐదవ రోజు ఆదివారం అమ్మవార్లకు బోనాల చెల్లింపుతో వేడుకలు ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని బోనా లు చెల్లించారు. సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిగింది. – దుండిగల్,ఆగస్టు 25

## ఆహ్వానం..

బాలానగర్, వినాయక్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని కలిసి శ్రీకృష్ణాష్టమి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఇందిరానగర్ యాదవ సంఘం ప్రతినిధులు – బాలానగర్, ఆగస్టు 25

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) ఈ కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.17, వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 55, కాకరకాయ 23, బీరకాయ 28, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 60, క్యారెట్ 50, కాలీ ఫ్లవర్ 18, దొండ 21, చిక్కుడు 45, గోరుచిక్కుడు 23, బీట్‌రూట్ 25, క్యాప్సికం 47, ఆలుగడ్డ 38, కీరా 28, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ 20, కందగడ్డ 50, ఉల్లిపొరక 35 , ఉల్లిగడ్డ 49, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 55, గుమ్మడికాయ 20, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

# ఉమామహేశ్వరకాలనీ అభివృద్ధికి చర్యలు

## ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఉమామహేశ్వరకాలనీ ముంపు ప్రాంతాన్ని ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు బీజేపీ శ్రేణులు సందర్శించి పరిశీలించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఉమామహేశ్వరకాలనీ ముంపునకు గురవుతుందని, దీంతో ఇక్కడి ప్రజల పరిస్థితిపై ఎంపీ నేరుగా పరిశీలించి.. వారిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రూ.40 కోట్లకు పైగా నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టారని, ఎంతమేరకు నిధులు ఖర్చు చేశారనేదానిపై సంబంధిత అధికారయంత్రాంగంతో ఫోన్‌లో ఆరాతీసి..మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని, ఇంకా నిధులు అవసరముంటే తన నిధుల నుంచి మంజూరు చేయించి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దబుద్దుల సతీశ్ సాగర్, బీజేపీ కుత్బుల్లాపూర్ కో-కన్వీనర్ శివాజీరాజ్, నాయకులు సరితారావు, రాజశేఖర్, మాధురి, అశోక్, కాలనీవాసులు ఉన్నారు.

ఉమామహేశ్వరకాలనీ ముంపు ప్రాంతం సమస్యపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**బహిరంగ ప్రకటన**

దివంగత Capt గరిమెళ్ల వెంకట సన్యాసి రాజేశ్వర్ రావు తన ఇష్టానుసారం, తన భార్య శ్రీమతి గరిమెళ్ల పారిజాతం రాజేశ్వర్ రావును తన ఏకైక చట్టపరమైన వారసురాలుగా చేసుకున్నారని మరియు క్రింద పేర్కొన్న ఆస్తులను ఆమెకు మాత్రమే కట్టబెట్టారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. హక్కు లేదా ఆసక్తిని క్లెయిమ్ చేసే వ్యక్తులు లేదా దీనిని సవాలు చేసే వ్యక్తులు 30 రోజుల వ్యవధిలో సంబంధిత డాక్యుమెంటరీ రుజువులతోపాటు సంతకం చేసిన న్యాయవ్యాదికి వ్రాతపూర్వకంగా ప్రతిస్పందించవలసి ఉంటుంది. ఆ తర్వాత ఈ విషయంలో చేసిన ఏవైనా క్లెయిమ్‌లు మాఫీ చేయబడినట్లు పరిగణించబడతాయి.

ఆస్తి ఒకటి-2వ అంతస్తు అపార్ట్‌మెంట్ 202, జ్యోతి మానర్, ఫ్లాట్ 41, ఇంటి నం. 8-3-1094/1/202, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073. విస్తీర్ణం 78 చ.గజాలు, బిల్ట్ 2310 చ.అడుగులు, ఆస్తి రెండు - డోర్ నం. 2-22-283/1, 2వ అంతస్తు, సరోజ కాంప్లెక్స్, ఫ్లాట్ 148, 149, 150, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి - 500072. విస్తీర్ణం 2197 చ.అడుగులు.

సం/- కదరం హరిదర్, న్యాయవాది, ఫ్లాట్ నం. 202, ఎలిగెంట్ అపార్ట్‌మెంట్స్, రాజ్‌భవన్ రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ, ఫోన్ నం. 9963244233